కల్హేర్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్త దారుణ హత్య

- డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఇది ముమ్మాటికీ రాజకీయ హత్యే
- నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

హరిసింగ్ (ఫైల్)

నారాయణఖేడ్/కల్హేర్, మార్చి 31: సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వీరాభిమాని, బీఆర్‌ఎస్ కార్యకర్త హరిసింగ్ దారుణ హత్యకు గురయ్యాడు. కొత్తచెరువుతండాకు చెందిన హరిసింగ్(50)కు తండాలో సొంత ఇల్లు కూడా లేని స్థితిలో కూలి చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. హరిసింగ్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. ఆదివారం ఉగాది సందర్భంగా కల్హేర్‌లో పంచాంగ శ్రవణానికి వెళ్లిన హరిసింగ్ తిరిగి ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం నీలంవాగు సమీపంలో శవమై కనిపించాడు. సమాచారం అందుకున్న సిర్గాపూర్ ఎస్సై వెంకట్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరి విచారణ చేపట్టారు. హరిసింగ్ మెడకు టవల్ బిగించి హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టగా జాగిలం మృతదేహం నుంచి కొద్ది దూరం వరకు వెళ్లి ఆగిపోయింది. కల్హేర్‌లో సీసీ ఫుటేజీలను సేకరించి వాటి ఆధారంగా విచారణ కొనసాగిస్తున్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు సమాచారం.

బీఆర్‌ఎస్ క్రియాశీల కార్యకర్త హరిసింగ్ బీఆర్‌ఎస్‌లో క్రియాశీలకంగా వ్యవహరించేవాడని తండావాసులు చెప్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తిచూపేవాడని పేర్కొంటున్నారు. భూపాల్‌రెడ్డి మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తారని, కేసీఆర్ ముఖ్యమంత్రి కావడం ఖాయమని వాదించేవాడని చెప్తున్నారు. ఈక్రమంలో హరిసింగ్ హత్యకు రాజకీయ కారణాలు ఉండవచ్చనే సందేహాలు తలెత్తుతున్నాయి.

రాజకీయ హత్యే: భూపాల్‌రెడ్డి

హరిసింగ్ హత్య విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హరిసింగ్‌ది ముమ్మాటికీ రాజకీయ హత్యే నని, ఇది పిరికిపందల చర్యగా పేర్కొన్నారు. గతంలో సిర్గాపూర్ మండలంలోనూ బీఆర్‌ఎస్ కార్యకర్తను హత్య చేసిన విషయాన్ని గుర్తుచేశారు. హరిసింగ్ హత్యకు బాధ్యులైన వారిని వెంటనే పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజకీయాల్లో ఇది మంచిది కాదన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో కక్షసాధింపు, హత్యా రాజకీయాలను ప్రోత్సహించలేదని స్పష్టంచేశారు.

ఘటనా స్థలంలో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్న పోలీసులు

• వేముల సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరికలు

నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో వివిధ పార్టీలకు చెందిన వారు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పల్లికొండ నర్సయ్య, భీమ్‌గల్ మాజీ కౌన్సిలర్ లింగం, మోర్తాడ్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు తక్కురా రంజిత్, భీమ్‌గల్ మండలం సికింద్రాపూర్ పెద్దమ్మకాడి తండా తాజా మాజీ సర్పంచ్ లౌడియ రమేశ్‌నాయక్‌తోపాటు వారి అనుచరులు బీఆర్‌ఎస్‌లో చేరగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. - వేల్పూర్



• బీఆర్‌ఎస్‌లోకి కాంగ్రెస్ కార్యకర్తలు

నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం మొగల్‌మడ్కకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు 30 మంది సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి నారాయణపేట మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. - నారాయణపేట



సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లో కూలి పని చేసిన మహిళలకు డబ్బులు అందజేస్తున్న మహిళా రైతు విజయ, డబ్బులను చూపిస్తున్న మహిళా రైతులు

గులాబీ సభ కోసం కూలిపనికి!

మొదటిపేజీ తరువాయి...

వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. బహిరంగ సభకు హాజరయ్యేందుకు వాహన కిరాయిలు, భోజనాలు, దారి ఖర్చుల కోసం కూలి పనులు చేపట్టారు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పదేండ్లపాటు వివిధ హోదాల్లో ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారు సైతం కూలి పని చేయడం విశేషం.



రైతు బాల్‌రెడ్డి మక్కచేనులో కూలి పని

బెజ్జంకి మండలం లక్ష్మీపూర్‌లోని రైతు బాల్‌రెడ్డి మక్కచేనులో బీఆర్‌ఎస్ మహిళా నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు కూలి పని చేశారు. మక్కలు ఏరే కార్యక్రమంలో పాల్గొన్నారు. చేనులో ఉన్న కంకులను ఏరారు. సుమారు వంద మందికిపైగా మహిళా నేతలు పనిలో పాల్గొన్నారు. దాదాపు 3 గంటలు పని చేశారు. ఇందుకుగాను వారికి రైతు రూ.10 వేలు ఇచ్చారు. వీటిని కేసీఆర్ సభకు వినియోగించుకుంటామని మహిళా నేతలు చెప్పారు. రజతోత్సవ సభకు భారీ ఎత్తున తరలివెళ్తామని మహిళలు, రైతులు చెప్తున్నారు.

కేసీఆర్ సారే మళ్లీ రావాలి

కేసీఆర్ సార్ మళ్లీ వస్తేనే ప్రజల గోస తీరుద్ది. రేవంత్‌రెడ్డి మహిళలకు రూ.2,500 ఇస్తా అన్నడు. రూపాయి ఇవ్వలేదు. కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతోపాటు తులం బంగారం ఇస్తా అన్నడు. ఇవ్వలేదు. కేసీఆర్‌సార్ ఉండగా రూ.లక్ష కట్నం అందుతుండే. ఇప్పుడు ఏదీ లేదు. రుణమాఫీ, రైతుభరోసా అన్నడు కానీ రాలేదు. రూ.4 వేల ఫించన్ అన్నడు కానీ, రూ.2 వేలకు కూడా గతి లేదు. ప్రజలను పిచ్చోళ్లను చేస్తుండు, కేసీఆర్ సార్ వస్తేనే ప్రజలు మంచిగ ఉంటరు. ఆ సారే మళ్లీ రావాలి.

- ముక్కీస విజయ, మహిళా రైతు, లక్ష్మీపూర్

పదేండ్లు కేసీఆర్‌ను సీఎంగా దీవించింది ఆడబిడ్డలే

బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు వెళ్లేందుకు అవసరమైన దారి ఖర్చుల కోసం లక్ష్మీపూర్‌లో రైతు బాల్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో మక్కజొన్న కంకులు ఏరుతూ కూలి పని చేసిన ఆడబిడ్డలకు కృతజ్ఞతలు. ఆనాడు కేసీఆర్‌ను ముందుండి నడిపి తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించింది ఆడబిడ్డలే. కొట్లాడి తెచ్చిన తెలంగాణలో పదేండ్లు కేసీఆర్‌ను దీవించి సీఎంను చేసింది ఆడబిడ్డలే. బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ కోసం వాహనాలను బీఆర్‌ఎస్ పార్టీ ఏర్పాటుచేస్తుందని తాము చెప్పినప్పటికీ, తమ సొంత ఖర్చులతోనే వాహనాలు ఏర్పాటు చేసుకుని వస్తామని కూలి పనిచేసిన ఆడబిడ్డలకు శతకోటి వందనాలు. ఇది పార్టీ పట్ల, కేసీఆర్ పట్ల వారుచూపుతున్న అభిమానానికి నిదర్శనం.

- మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే, రసమయి బాలకిషన్

984 మందిలో మెరిట్ అభ్యర్థి లేరా?

- ఆరు సెంటర్ల నుంచి టాప్-500లో ఎవరూ లేరు
- గ్రూప్-1 అవకతవకలపై అభ్యర్థుల పోరు ఉధృతం
- రాజకీయపార్టీల సహకారం కోరిన నిరుద్యోగులు
- నేడు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం
- కార్యాచరణ ప్రకటించే అవకాశం

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): ఒక సెంటర్‌లో వెయ్యి మంది అభ్యర్థులు పరీక్ష రాస్తే టాప్-500 జాబితాలో ఒక్కరు కూడా లేరు. రెండు సెంటర్ల నుంచే 74మంది టాప్-500లో ఉన్నారు. తక్కువ మంది రాసిన సెంటర్ల నుంచి పదుల సంఖ్యలో అభ్యర్థులు టాప్‌లో ఉండటం, ఎక్కువ మంది రాసిన చోట వారిలో నుంచి ఒక ఒక్కరు లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నదని అభ్యర్థులు చెప్తున్నారు. ఇలాంటి వ్యత్యాసాలు గ్రూప్-1మెయిన్స్‌లో చాలా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీంతో మెయిన్స్‌లో అవకతవకల ఆరోపణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. జనరల్ ర్యాంకింగ్ లిస్టులో (జీఆర్‌ఎల్) ఒకే సెంటర్ నుంచి అత్యధికులు టాప్‌మార్కులు సాధించడం, మరికొన్ని సెంటర్ల నుంచి ఒక్కరు కూడా లేకపోవడమే అక్రమాలకు నిదర్శనమని క్యాండిడేట్స్ చెప్తున్నారు. కొన్ని సెంటర్లల్లో కాపీయింగ్ జరిగిందా? లేక కావాలనే ఎక్కువ మార్కులేశారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరీక్షలు నిర్వహించిన ఆరు సెంటర్ల నుంచి టాప్-500లో ఎంపికైన వారున్నారా? అని చూస్తే ఒక్కరు కూడా లేకపోవడం పట్ల చాలామంది ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. ఆయా సెంటర్ల నుంచి దాదాపు 3,800 మంది పరీక్షలు రాస్తే ఒక్కరు కూడా మెరిట్‌లో ఉండకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఒక సెంటర్‌లో మొత్తం 984 మంది పరీక్షరాస్తే టాప్-500 జాబితాలో ఒక్కరంటే ఒక్కరు కూడా లేరు. ఇంతమంది రాస్తే ఒక్కరు కూడా మెరిట్ జాబితాలో ఉండరా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రెండు సెంటర్ల నుంచి 74 మంది టాప్-500 జాబితాలో ఉన్నారు. మరో 25 సెంటర్ల నుంచి కేవలం 68 మందే ఉన్నారు. ఇది పూర్తిగా అనుమానాలకు తావిస్తున్నది. కొన్ని సెంటర్ల నుంచి ఒక్కరంటే ఒక్కరు కూడా లేకపోవడంతో భారీ అక్రమాలు జరిగాయని, గ్రూప్-1లో జరిగిన కుంభకోణమేని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. మొత్తం వ్యవహారంపై జ్యుడీషియల్ కమిషన్‌తో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు.

నేడు సోమాజిగూడలో భేటీ

గ్రూప్-1లో తెలుగు మీడియం అభ్యర్థులకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. మూల్యాంకనంలో లోపాలు, టీజీపీఎస్సీ అనుమానాలు ఉన్నాయని చెప్తున్నారు. ఇంగ్లిష్ మీడియం వారికి ఎక్కువ మార్కులేసి, తెలుగు మీడియం వారికి తక్కువ మార్కులేశారని, చేతిరాతను బట్టి కూడా అదనంగా మార్కులేశారని ఆరోపిస్తున్నారు. జవాబు పత్రాలును మరోసారి మూల్యాంకనం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం గ్రూప్-1 జీఆర్‌ఎల్ విడుదల నేపథ్యంలో పోరును మరింత ఉధృతం చేయాలని నిర్ణయించారు. ఒకవైపు న్యాయపోరాటం చేస్తూనే, మరోవైపు ప్రత్యక్ష పోరుకు దిగాలన్న వ్యూహంతో ముందుకెళ్తున్నారు. ఇందులోభాగంగా నిరుద్యోగ జేఏసీ నేతలు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. గ్రూప్-1లో నష్టపోయిన అభ్యర్థులంతా ఈ సమావేశానికి తరలిరావాలని నిరుద్యోగ జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశం తర్వాత ఉద్యమ కార్యాచరణను ప్రకటించే అవకాశాలున్నాయి. ఇప్పటికే గ్రూప్-1 మెయిన్స్ మూల్యాంకనంపై హైకోర్టులో మూడు కేసులు వేశారు. ఇదిలా ఉండగా, ప్రత్యక్షపోరుకు సమాయత్తమవుతున్నారు.

హాజరు కానున్న అఖిలపక్షనేతలు

గ్రూప్ -1పై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు నిరుద్యోగ జేఏసీ నేతలు మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమావేశం కానున్నారు. అఖిలపక్షనేతలు ఈ సమావేశానికి హాజరుకానున్నారు. ప్రజాసంఘాల నేతలు కూడా పాల్గొననున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, రాకేశ్‌రెడ్డి, బీజేపీ నాయకుడు మురళీ మనోహర్, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, బీఎస్పీ నాయకుడు మల్లు ప్రభాకర్, తెలంగాణ ఉద్యమకారులు విఠల్, పృథ్వీ, బక్క జడ్సన్‌ను ఈ సమావేశానికి ఆహ్వానించారు.

గ్రూప్-1 మెయిన్స్ మెరిట్ చిట్టా... అనుమానాల పుట్ట!

సెంటర్ కోడ్	అభ్యర్థులు	టాప్-500లో
18	792	37
19	864	37
04	984	0
31	600	0
42	112	0
39	355	0
40	984	0
41	528	0
02	950	1
05	984	4
02	360	7
14	432	7
45	960	1
21	984	2
43	960	1
37	504	1
38	124	1

18, 19- కోఠి ఉమెన్స్ కాలేజీ

బీజేపీ గ్రాఫ్ డౌన్!

మొదటిపేజీ తరువాయి...

సమాధానాలు ఇచ్చిందని చెప్తున్నారు.

వాడిపోయిన కమలం

'2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ ప్రభావం తగ్గిపోయిందా?' అని ఇటీవల ఓ నెటిజన్ 'గ్రోక్'ను ప్రశ్నించాడు. దీనికి ఏఐ చాట్‌బాట్ స్పందిస్తూ... '2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ బలహీనపడింది. గతంతో పోలిస్తే ఆ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 63 సీట్లను కోల్పోయి 240 స్థానాలకు పరిమితం కావాల్సి వచ్చింది. పార్టీపరంగా విభజన రాజకీయాలు చేస్తుండటంతో బీజేపీపై ప్రజల్లో క్రమంగా వ్యతిరేకత పెరుగుతున్నది' అని సమాధానమిచ్చిన గ్రోక్.. మొత్తంగా క్షేత్రస్థాయిలో బీజేపీ గ్రాఫ్ పడిపోతున్నదని సంకేతాలిచ్చింది. ఇక, బీజేపీతో పాటు ప్రధాని మోదీ పాపులారిటీ కూడా క్రమంగా తగ్గిపోతున్నదని గ్రోక్ చెప్పింది. మిత్రపక్షాల సహకారంతో అధికారంలోకి వచ్చి ప్రధాని పీఠాన్ని మోదీ అధిరోహించినప్పటికీ, గతంతో పోలిస్తే మోదీ క్రేజ్ అంతకంతకు పడిపోతున్నట్టు గ్రోక్ తేల్చిచెప్పింది.

అన్నింటా ఫెయిల్

మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ఎన్నో హామీలు కురిపించారు. కానీ, ఆ హామీలను నిలబెట్టుకోవడంలో మాత్రం చేతులెత్తేశారు. ఇదే విషయమై ఓ నెటిజన్ 'గ్రోక్'ను ప్రశ్నించాడు. బీజేపీ ప్రభుత్వంలో విధానపరమైన వైఫల్యాల గురించి కూడా వివరించాలని గ్రోక్‌ను కోరాడు. దీనికి చాట్‌బాట్.. ఎన్నికల హామీలను మోదీ నిలబెట్టుకోలేదని స్పష్టం చేసింది.

'గ్రోక్' చెప్పిన నిప్పులాంటి నిజాలు

మోదీ నిలబెట్టుకోలేకపోయిన హామీలు

- ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ఇవ్వకపోవడం
- నల్లధనాన్ని వెనక్కి తెస్తామని హామీ ఇచ్చి మాటతప్పడం
- 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని చెప్పి వదిలేయడం

బీజేపీ సర్కారు వైఫల్యాలు

- దేశంలో నిరుద్యోగ సమస్య
- పెద్దనోట్ల రద్దుతో ఆగమైన ఆర్థిక వ్యవస్థ- అటకెక్కిన నల్లధనం హామీ
- చిరు వ్యాపారులను దెబ్బతీసిన జీఎస్టీ
- నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలు.. తలొగ్గిన ప్రభుత్వం
- కొవిడ్ సంక్షోభంలో వైద్య సేవల కొరత
- నాణ్యమైన విద్య అందకపోవడం
- అవినీతి పెరిగిపోవడం
- మహిళలపై నేరాలు
- నిధుల కేటాయింపుల్లో కొన్ని రాష్ట్రాలపై వివక్ష
- పత్రికాస్వేచ్ఛను అణచివేయడం
- పాకిస్థాన్‌తో ఉగ్రవాద సమస్య పరిష్కారం కాకపోవడం
- జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు ఇంకా అందరికీ అందకపోవడం
- ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల ఆలస్యం
- వాతావరణ మార్పులపై చర్యలు

కొలువు రాలేదని యువతి ఆత్మహత్య

- ఇటీవల గ్రూప్-1, 2 పరీక్షలు రాసిన శ్రుతి
- ఉద్యోగం రాక మనస్తాపం
- జగిత్యాల జిల్లాలో విషాదం

శ్రుతి (ఫైల్)

కథలాపూర్, మార్చి 31: గ్రూప్-1, 2 పరీక్షలు రాసినప్పటికీ.. ఆశించిన ఫలితాలు రాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. కథలాపూర్ మండల కేంద్రానికి చెందిన ఆకుల శ్రుతి(27) ఎంకాం పూర్తి చేసి, గ్రూప్స్‌కు సన్నద్ధమైంది. ఇటీవలే గ్రూప్-1, 2 పరీక్షలు రాసింది. ఇటీవల విడుదలైన ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకపోవడం, తండ్రి శ్రీనివాస్ అనారోగ్యానికి గురై మంచానికి పరిమితం కావడంతో కలత చెందింది. ఏడాదిగా కడుపు నొప్పితో బాధపడుతూ పలు దవాఖానల్లో చికిత్స చేయించుకోవడంతో ఆర్థికంగా ఇబ్బంది పడింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రుతి సోమవారం ఉదయం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

మరో రైతు ఆత్మహత్య

- నీళ్లు లేక ఎండిన పంట..
- మరోవైపు మీదపడ్డ అప్పులతో మనస్తాపం
- కామారెడ్డి జిల్లా పొందుర్తిలో విషాదం

స్వామి (ఫైల్)

రాజంపేట, మార్చి 31: నీళ్లులేక పంట ఎండిపోగా.. అందుకోసం చేసిన అప్పులు మీదపడటంతో తీవ్ర మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం పొందుర్తిలో సోమవారం జరిగింది. ఎస్సై పుష్పరాజ్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన తిరుగుడు స్వామి (36) తనకున్న రెండెకరాల్లో వరి సాగు చేశాడు. పొలంలో వేసిన బోరు ఎత్తిపోవడంతో నీరందక పంట ఎండింది. మరోవైపు పెట్టుబడి కోసం చేసిన అప్పుతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. అప్పు తీర్చే మార్గం లేక బాధపడుతున్న రైతు సోమవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంట్లో ఫ్యాన్‌కు లుంగీతో ఉరేసుకున్నాడు. అప్పుడే లేచి గమనించిన భార్య గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కిందికి దింపి చూడగా స్వామి అప్పటికే మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు.

అబద్ధాల పునాదులపై రేవంత్ సర్కార్

- నీళ్లివ్వకుండా రైతులను ఆగం చేస్తున్న ప్రభుత్వం
- కాళేశ్వరాన్ని అప్పగిస్తే మూడు రోజుల్లో నీళ్లిస్తాం
- సవాల్‌కు ప్రభుత్వం ఇప్పటికీ స్పందించడంలేదు
- హుజూర్‌నగర్ సభలో రేవంత్ వ్యాఖ్యలపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మండిపాటు

సూర్యాపేట, మార్చి 31 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్ అబద్ధాల పునాదులపై పాలన సాగిస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ మోసపూరిత మాటలను నమ్మిన ప్రజలు అధికారం ఇచ్చారని, అయితే సర్కారు పాలన మూర్ఖపు ఆలోచనలతోనే నడుస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి పద్ధతి, వాడుతున్న భాషే ఆయన్ను బొందపెడుతుందని అన్నారు. సోమవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. సోనియాగాంధీ ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు మోసపోయారు తప్ప రేవంత్‌రెడ్డి మూర్ఖపు మాటలకు కాదని పేర్కొన్నారు. ఆదివారం హుజూర్‌నగర్‌లో నిర్వహించిన సభలో కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి విమర్శలు చేయడంపై మండిపడ్డారు. రేవంత్ సర్కార్ చిన్న సాకుతో కాళేశ్వరాన్ని పండబెట్టి గత రెండు సీజన్లలో రైతుల పంటలను ఎండబెట్టిందని అన్నారు. ప్రాజెక్ట్‌ను తమకు అప్పగిస్తే మూడు రోజుల్లోనే నీటిని ఇస్తామని చెప్పినా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని తెలిపారు. కేసీఆర్‌పై కోపంతో పంటలను ఎండబెట్టడం దుర్మార్గమని అన్నారు. వచ్చే సీజన్‌కు కూడా నీళ్లివ్వాలనే ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని చెప్పారు. కన్నెపల్లి పంప్‌హౌస్ బాగానే ఉందని అధికారులు చెప్తున్నా నడిపించే సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఒక్క తడికి నీళ్లిస్తే కనీసం పెట్టుబడి ఖర్చు అయినా తిరిగి వస్తుందని తెలిపారు. వచ్చే సీజన్‌లో పంటలను సాగు చేసేందుకు, కాళేశ్వరం కొనసాగింపునకు మరో ఉద్యమం చేయాల్సిన సమయం ఆసన్నమైందని, ఇందుకు రైతులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

విద్యుత్తు షాక్‌తో యువ రైతు మృతి

పెంబి, మార్చి 31 : విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన నిర్మల్ జిల్లా పెంబి మండలం మందపెల్లి శివారులో చోటుచేసుకున్నది. రైతు ఆత్రం నాగోరావు (35) సోమవారం ఉదయం మక్క చేనుకు నీరందించడానికి పొలానికి వెళ్లాడు. మోటర్ ఆన్ చేస్తుండగా విద్యుత్తు షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. మధ్యాహ్నం పంటకు కాపలా కోసం వెళ్లిన అతని సోదరుడు గమనించి కుటుంబసభ్యులు, పోలీసులకు సమాచారం అందించాడు.

బిడ్డర్ల అభ్యర్థన మేరకే నిబంధనల మార్పు

- నమస్తే తెలంగాణ' కథనంపై టీజీ జెన్‌కో వివరణ

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): బిడ్డర్ల అభ్యర్థనల మేరకే సిమెంట్, స్టీల్ ధరలను కాంట్రాక్టర్ల పరిధిలోకి చేర్చామని, తద్వారా ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం నామమాత్రమేనని టీజీ జెన్‌కో వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల సివిల్ పనులకు సంబంధించి టెండర్లలో సిమెంట్, స్టీల్ ధరను కాంట్రాక్టర్ల పరిధిలోకి కొత్తగా తీసుకొచ్చారు. దీంతో వేలాది కోట్ల రూపాయల భారం పడుతుందనే విమర్శలున్నాయి. ఇదే విషయమై 'ప్రజాధనం లూటీకి రంగం సిద్ధం' పేరిట 'నమస్తే తెలంగాణ' సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై జెన్‌కో స్పందించింది. జెన్‌కో పరిధిలో రూ.928.52 కోట్ల విలువైన సివిల్ పనులకు 9సార్లు టెండర్లు ఆహ్వానించినా ఎవరూ ముందుకు రాలేదని పేర్కొన్నది. ప్రీ-బిడ్ సమావేశాన్ని నిర్వహించగా, మార్కెట్ మార్పులను పరిగణనలోకి తీసుకుని ధర మార్పు నిబంధనను చేర్చాలని బిడ్డర్లు అభ్యర్థించారని తెలిపింది.

విల్లు ధ్రువీకరణ చట్టప్రకారం జరగాల్సిందే

- ఎన్‌టీఆర్ వీలునామాపై హైకోర్టు స్పష్టీకరణ

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): బసవతారకం ట్రస్టు నిర్వహణకు సంబంధించి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు రాసిన వీలునామా వ్యవహారంలో లక్ష్మీపార్వతికి చుక్కెదురైంది. 1995లో ఆ వీలునామాను సవరించినప్పుడు ధ్రువీకరించిన ఇద్దరు అటెస్టర్లు ప్రస్తుతం లేనందున ఆ వీలునామా ధ్రువీకరణ చట్టంలోని నిబంధనల ప్రకారం జరగాల్సిందేనని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళ్తే.. ఎన్‌టీఆర్ వీలునామా ప్రకారం తనను బసవతారకం ట్రస్ట్ మేనేజర్‌గా నియిమంచాలని కోరుతూ లక్ష్మీపార్వతి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఆ వీలునామాను ధ్రువీకరిస్తూ సంతకాలు చేసిన జే వెంకటసుబ్బయ్య, వై తిరుపతిరావు చనిపోయినందున వెంకటసుబ్బయ్య కుమారుడైన జేవీ ప్రసాదరావు సాక్ష్యాన్ని అనుమతించాలని సివిల్ కోర్టు నిర్ణయించింది. దీన్ని సవాలు చేస్తూ బసవతారకం మెమోరియల్ మెడికల్ ట్రస్టుతోపాటు ఎన్‌టీఆర్ కుమారుడు బాలకృష్ణ తదితరులు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జీ రాధారాణి తీర్పు వెలువరించారు. నిబంధనలకు విరుద్ధంగా లక్ష్మీపార్వతి తీసుకొచ్చిన జేవీ ప్రసాదరావు సాక్ష్యం చెల్లదని స్పష్టం చేశారు.

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంపై సిట్

- ఐజీ రమేశ్ నేతృత్వంలో ఏర్పాటు

హైదరాబాద్, మార్చి 31 (నమస్తే తెలంగాణ): బెట్టింగ్ యాప్స్‌తో తెలుగు రాష్ర్టాల్లో ఆర్థిక విధ్వంసం, బాధితుల ఆత్మహత్యలపై ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. దీనిపై విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ఏర్పాటు చేస్తూ డీజీపీ జితేందర్ ఆదేశాలు జారీచేశారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎం రమేశ్ నేతృత్వంలోని ఈ బృందంలో ఇంటెలిజెన్స్ ఎస్పీ సింధు శర్మ, సీఐడీ ఎస్పీ వెంకటలక్ష్మి, సైబరాబాద్ అదనపు ఎస్పీ చంద్రకాంత్, సీఐడీ డీఎస్పీ శంకర్‌ను నియమించారు. సోషల్ మీడియాలో బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేస్తున్నవారిపై పంజాగుట్టతోపాటు సైబరాబాద్‌లోని మియాపూర్‌లో ఇప్పటికే 2 కేసులు నమోదవడంతో పలువురు ఇన్‌ఫ్లూయెన్సర్లను విచారించారు. ఈ 2 కేసుల్లో 25 మంది టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులు, టీవీ యాంకర్లు, యూట్యూబర్స్ ఉన్నారు. ఈ 2 కేసులను సిట్‌కు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్థిక నిపుణులు, న్యాయాధికారులు, ఆడిటర్లు, ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ నిపుణులను సిట్‌లో చేర్చుకునే అవకాశం ఉన్నది. ఈ బృందం కేవలం కేసులను దర్యాప్తు చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్స్ తీరుతెన్నులపై అధ్యయనం జరిపి 90 రోజుల్లో డీజీపీకి నివేదిక సమర్పించనున్నది.

గుడికి వెళ్తే..గ్యాంగ్‌రేప్

మొదటిపేజీ తరువాయి...

ఊర్కొండపేట శివారులో చోటుచేసుకున్నది. గ్రామస్థుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత తన బంధువులతో కలిసి శనివారం సాయంత్రం ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయానికి వచ్చింది. దైవదర్శనం అనంతరం భజనలు చేస్తూ ఉండిపోయారు. రాత్రి వేళ బహిర్భూమి కోసం ఆలయం వెనుక భాగంలో ఉన్న గుట్ట సమీపంలోకి వివాహిత వెళ్లింది. మద్యం తాగుతున్న ఎనిమిది మంది యువకులు వివాహితను అడ్డగించారు. వివాహిత ఎంతకు రాకపోవడంతో అనుమానం వచ్చిన ఆమె బంధువొకరు వెతుక్కుంటూ ఘటనా స్థలానికి వెళ్లాడు. దీంతో యువకులు అతడిపై దాడి చేసి చేతులు కట్టేసి, వివాహితపై రాత్రంతా సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డట్టు తెలిసింది. మహిళ స్పృహ కోల్పోగా.. తెల్లవారు జామున మెలకువ వచ్చింది. బంధువు కట్లను తొలగించి, ఊర్కొండ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన నగలు ఎత్తుకెళ్లారని, తనపై అనుచితంగా ప్రవర్తించారని ఫిర్యాదు ఇచ్చి వెళ్లిపోయింది. ఆ మహిళ ఆలయంలోని ఉద్యోగి గురించి చెప్పినట్టు సమాచారం. పోలీసులు ఆ ఉద్యోగిని అదుపులోకి తీసుకుని విచారించగా లైంగిక దాడిలో పాల్గొన్న మిగతా వారి వివరాలు చెప్పినట్టు తెలిసింది. ఆదివారం మధ్యాహ్నం వివాహిత, బంధువులు పోలీస్‌స్టేషన్‌కు రాగా, పోలీసులు పూర్తి వివరాలు సేకరించినట్టు తెలిసింది. ఏడుగురిని అదుపులోకి తీసుకోగా, ఒకరు పరారీలో ఉన్నట్టు సమాచారం.